ఉపాధ్యాయ మాసపత్రిక కథల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కథ

# అగ్నిస్వరాలు

ఇంటి ముందు కారు పార్కు చేసి లోపలికెళ్ళబోతూ యథాలాపంగా ఓ పక్కకి చూశాను.

ఆకృతి స్కూటర్ లేదు. వాచీ చూశాను. రాత్రి తొమ్మిదీ పది. ఇంతదాకా ఎక్కడ షికార్లు కొడుతోందో!

"సుధా! ఆకృతి ఇంకా రాలేదేంటి? ఎక్కడుందో ఏమైనా ఫోన్ చేసిందా?" లోపలికెళ్తూనే అసహనంతో రగుల్తూ అడిగాను.

"కన్నాట్ ప్లేస్ కెళ్తున్నానని సాయంత్రమెప్పుడో చెప్పింది. ఏవో బుక్స్ కొనుక్కోవాలంది"

"ఒక్కతే వెళ్ళిందా?"

"ఫ్రెండ్సంతా వెళ్ళుంటారు...."

"నిమ్మకి నీరెత్తినట్టు మాట్లాడతావేంటి? ఇది ఢిల్లీ తెలుసా? మన ఊరూ కాదు వాడా కాదు, గుండెల మీద చేతులేసుకుని నిశ్చింతగా వుండటానికి!"

"మీరు మరీనూ. ఇదేదో అడవి అన్నట్టు మట్లాడతారేంటి. పేపర్లలో ఏవేవో రాస్తూంటారు. అవన్నీ చదివి భయపడ్తూ కూర్చుంటే ఇక బతికినట్టే!"

"నీకర్థం కాదులే. ఇంకో రెండేళ్ళు ముక్కు మూసుకుని గడిపేస్తే రిటైరైపోతాను. హాయిగా హైదరాబాదెళ్ళి సెటిలైపోవచ్చు....."

"అక్కడికదేదో భద్రనగరమైనట్టు! ఆడది ఏ ఊళ్ళో అయినా ఏ కాలంలో అయినా ఒడిలో నిప్పులు మోస్తూ తిరగాల్సిందే!"

పిచ్చిగా చూశాను. "అర్థం లేకుండా మాట్లాడకు. ఆడది అణగి మణగి వుండాలి. తలుపు చాటున గాకపోయినా లక్ష్మణ రేఖకి లోపలే వుండాలి. అప్పుడే వాళ్ళు హ్యాపీ, వాళ్ళ వాళ్ళు హ్యాపీ......"

సుధ అదోలా చూసి వెళ్ళిపోయింది. ఆ చూపులో నిరసనధ్వని వుందా?

స్నానం చేసొచ్చాను. వేడి వేడి అన్నం వడ్డించింది. తినబోతూ, "ఆకృతి మళ్ళీ

ఫోన్ చేసిందా?" అడిగాను.

"లేదు"

"బొత్తిగా బాధ్యత లేదు......" విసుక్కుంటూ సెల్ అందుకున్నాను.

ఆకృతి కాల్ రిసీవ్ చేసుకోగానే, "ఎక్కడున్నావ్?" అనడగ్గా, "వచ్చేస్తున్నా డాడ్. ఆన్ ద వే" అని జవాబిచ్చింది.

"జాగ్రత్తగా రా"

"ఎవర్నుంచి, దేన్నుంచి జాగ్రత్త?"

"తల తిక్క క్వొశ్చన్సొద్దు. తిన్నగా ఇంటికిరా"

లైన్ కట్ చేసి "అర్థరాత్రి దాకా షికార్లు చేసిందిగాక ఎదురు ప్రశ్నలొకటి! ఏం పిల్లలో ఏం పాడో! పుట్టిన ఒక్కరూ మగపిల్లాడై వుంటే ఈ భయాలేవీ వుండేవి కావు, వంశమూ నిలబడేది!" గొణుక్కున్నాను.

"ఆడపిల్లల్లోనూ మీ జీన్సూ, మీ పూర్వీకుల జీన్సూ వుంటాయి" నవ్వుతూ చురక అంటించింది సుధ.

"ఆ గోలెవడిక్కావాలి? మగపిల్లాడైతే ఎక్కడున్నాడు, ఏం చేస్తున్నాడు, ఎలా వుంటున్నాడు, ఎప్పుడు ఇంటికొస్తాడు అన్న భయాలుండవు. ఎప్పుడే ప్రక్కనుంచి ఎలాంటి ప్రమాదం వచ్చి పడుతుందోనన్న ఆందోళనా వుండదు. పెళ్లి చేసి పంపేక కట్టుకున్నవాడు చక్కగా చూసుకుంటున్నాడో లేక వేపుకు తింటున్నాడోనన్న పీడకలలూ వుండవు.....!"

"మీరు మరీనూ. లోకంలో ఇందరు తండ్రులున్నారు. ఎవరూ మీలాగా వుండరు"

"ఉండాలే. కాలం అలా వుంది. మన ఢిల్లీలో పద్దెనిమిది గంటలకో మహిళ అత్యాచారానికి గురవుతోందిట. ఈ ఏడాదిలో ఇంతవరకూ 580 అత్యాచారాలు నమోదయ్యాయిట. ఇక రికార్డుకెక్కనివి ఎన్నున్నాయో! అసలిలాటి గొడవలొస్తాయనే ఆడపిల్లకి పదేళ్ళకే పెళ్ళి చేసి అత్తారింటికి పంపెయ్యలన్నారు పూర్వులు......."

"వివాహితల్ని మృగాళ్ళు కనికరిస్తున్నారంటారా డాడ్" వస్తూనే పిడుగు విసిరింది ఆకృతి.

నాకు పులమారింది.

"నువ్వు బాగా ఆర్గ్యూ చేస్తావని తెలుసులే. ఆర్గ్యుమెంట్లు వేరు, వాస్తవం వేరు. మన స్థితినీ స్థానాన్నీ మరచిపోకూడదు. వీకర్ జెండర్ అన్న స్పృహ కలిగే వుండాలి. అలాగే మసలాలి. ముల్లొచ్చి ఆకు మీద పడ్డా, ఆకెళ్ళి ముల్లు మీద పడ్డా ఆకుకే నష్టం"

పెదాలు విడీ విడకుండా నవ్వింది. "ముల్లు మృదువుగా మారకూడదా?"

"మారదు. దాని స్వభావం అది. ఆ సంగతి గ్రహించి మన జాగ్రత్తలో మనం ఉండటం బెటర్"

"పిరికిపాలు పోస్తున్నారు డాడ్"

"నువ్వేమైనా అనుకో. ఆడవారికీ ఈ సమాజంలో భద్రత లేదన్న సంగతి నిద్రలో కూడా మర్చిపోవద్దు"

"స్త్రీకి స్వేచ్ఛ లేదంటారు. ఆడది అర్ధరాత్రి నిర్భయంగా తిరగగలిగినప్పుడే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టన్నారు గాంధీజీ. అయితే మనకింకా ఫ్రీడమ్ రానట్టేనా?"

"అసలు అర్ధరాత్రి తిరగాల్సిన అవసరమేమొచ్చింది?"

"నైట్ డ్యూటీలు, నైట్ షిఫ్టులు వుండవా? సినిమాలకూ పార్టీలకూ వెళ్ళకూడదా?"

"మా చిన్నప్పుడు మగపిల్లాడి తోడైనా లేకుండా ఆడవాళ్ళు గడపదాటేవారు కాదు తెలుసా?"

"ఇప్పటికీ ఆ రోజులే నడుస్తున్నాయంటారు!"

"అబ్బబ్బ! మళ్ళీ వాదనలు మొదలెట్టారూ! ఇంటిని కోర్టు చేసేస్తున్నారు కదా!" మధ్యలో కల్పించుకుంది సుధ.

"డాడ్ ఎలా అడ్డంగా వాదిస్తున్నారో చూడు మమ్మీ" ఫిర్యాదు చేసింది ఆకృతి.

"ఆయన భయాందోళనలన్నీ నీ క్షేమం గురించేనే తల్లీ. అదొక్కటి గుర్తుపెట్టుకో చాలు"

సుధ మాటలకు నా వంక సానుభూతిగా చూసింది ఆకృతి. చిన్నగా నిట్టూర్చి తన గదిలోకెళ్ళిపోయింది.

"చీకటి పడకుండానే ఇంటికి రమ్మని గట్టిగా చెప్పకుండా లైట్ తీస్కుంటావేంటి?"

"అది చిన్నపిల్ల కాదు. ఎం ఎస్సీ చదువుతోంది"

"అయినా ఆడపిల్లే కదా!"

"కాదు డాడ్. ఆడశరీరం!" అంటూ వచ్చింది ఆకృతి.

నేను గుటకలు మ్రింగాను.

"సరిసరే గాని భోం చేద్దాం రా...."

నా ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చుంది ఆకృతి. తనకీ నేనే వడ్డించాను.

"ఎమ్మెస్సీ అయ్యాక రీసెర్చ్ చేద్దామనుకుంటున్నాను డాడ్....."

"చెయ్యి తల్లీ. నువ్వు చదువుల సరస్వతివి. ఎన్నైనా సాధించగలవు. ఎన్ని ఎత్తులైనా ఎక్కగలవ్...."

"కానీలోగా మూడుముళ్ళూ వేయించుకోడానికి రెడీగా వుండు అన్నది ట్యాగ్‌లైన్" అని నా వాక్యాన్ని పూర్తి చేసింది సుధ.

"పెళ్ళే జీవితానికి పరమావధి అంటారు...." నావంక అర్థోక్తితో చూస్తూ అంది ఆకృతి.

"కాకపోవచ్చు. కాని మ్యారేజ్‌తో మనిషికి పరిపూర్ణత వస్తుంది. ఆజన్మ నేస్తం లభిస్తారు. తోడున్నారన్న భావన ధైర్యాన్నిస్తుంది. మేము, మా ఇల్లు, మా సంతానం–ఈ భావనలోనే అనంతమైన ఆనందం వుంది. తృప్తి వుంది. సహజీవన సౌభాగ్యం వుంది. జీవనరాగం వుంది"

"పుస్తకాల కబుర్లు చదవడానికీ వినడానికీ బావుంటాయి. కాని కళ్ళు విప్పిచూస్తే కట్నాకళ్ళూ, వరకట్న దహనాలూ, గృహహింసలూ, అణచివేతలూ, మూగవేదనలూ మాత్రమే కన్పిస్తాయి"

"శాడిజం వద్దు. పాజిటివ్ యాటిట్యూడ్‌తో చూడు, ప్రపంచం పచ్చగా కన్పిస్తుంది"

"అలాటి కళ్ళజోడు లేకుండా చూస్తే పచ్చిగా కన్పిస్తుందంటారు!"

"రామరామ! మళ్ళీ మొదలెట్టారూ! తిండి కూడా తిన్నగా తినరు కదా. అద్సరే గాని ఇందాకేదో రీసెర్చి అంటూ కొత్తరాగం అందుకున్నావేంటి ఆకృతీ...." సుధ ఆరా తీసింది.

"ఎన్నేళ్ళ నుంచో నాకో కల వుంది. దాన్ని నిజం చెయ్యడానికెందుకు పరిశోధన చెయ్యకూడదూ అన్పిస్తోంది" నా వంకే చూస్తూ అంది.

"డాడీ మాటలకా?" నవ్వుతూ అడిగింది సుధ.

"నా కలేంటో చెప్పనా డాడ్?" కళ్ళతో నవ్వుతూ, నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అంది.

"ఏంటది?"

"నేను తలచుకున్నప్పుడల్లా నా ఒంట్లోంచి కత్తులు మొలుచుకు రావాలి"

భ్రుకుటి ముడివేసి పిచ్చిగా చూశాను.

బిగ్గరగా నవ్వేసింది. "భయపడొద్దు. కత్తులంటే కత్తులు కాదులే. ముళ్ళనుకో. నేను బాగా పరిశోధించి ఒక పదార్థం కనుక్కొంటాను. ఆడవారి కోసమేలే. అది తింటే చాలు, వారు కోరుకున్నప్పుడు లేదా ఒక్కసారి ఒళ్ళు విరుచుకున్నప్పుడు వారి ఒంట్లోంచి ముళ్ళపంది ముళ్ళ లాంటివి వచ్చేస్తాయి. ఇంకప్పుడు మగభయం చచ్చినా వుండదు. నీలాంటివారు భద్రత, క్షేమం అంటూ ఆందోళన పడక్కర్లేదు. ఎలా వుంది నా ఐడియా?"

"వేళాకోళాలొద్దు. నేనెందుకింత ఇదిగా నొక్కి చెబుతున్నానో అర్థం చేసుకో. నా మాటల్లోని డెప్త్ గురించి సీరియస్‌గా ఆలోచించు" కంచం ముందు నుంచి లేచి చేతులు కడుక్కోడానికెళ్తూ సీరియస్‌గా చెప్పేను.

ఆకృతి బదులివ్వలేదు. బహుశా ఆలోచన రగిలి వుండొచ్చు.

ఎదిగిన ఆడపిల్లలు ఎద మీది కుంపట్లు. ఎంత చదివినా, ఎంత ఎదిగినా ఆడవాళ్ళు తమ రక్షణ బాధ్యతని తామే చూసుకోవాలి. ఇది అనాదిగా కాదు ఆది నుంచీ

వస్తోన్న కథే! ఈ కాలపు ఆడపిల్లలకి మగ స్నేహాలూ షికార్లూ ఇంటర్నెట్లూ పిజ్జాలూ బర్గర్లూ తప్ప స్వీయ రక్షణ మీద ధ్యాస ఉండక అనర్థాల్ని కొని తెచ్చుకుంటున్నారు !

గదిలోకెళ్ళి 'ఇండియా టుడే' చేతిలోకి తీసుకున్నాను.

మరికాస్సేపటికి పని ముగించుకొచ్చింది సుధ.

"ఇవాళ అదోలా వున్నారేవిటి?"

తల పంకిస్తూ మెల్లగా అన్నాను" కొంచెం డిస్టర్బ్డ్ గానే వుంది....."

"ఆఫీసులో ఏమైనా......!"

"ఆఫీసా ఇల్లా పార్కా పబ్లిక్ రోడ్డా క్లబ్బా కాలేజీయా బస్సా రైలా విమానమా అన్న తేడా లేదు. ఎక్కడైనా పంజా విసరొచ్చు....."

"తీవ్రవాదులా?"

"కామ పిశాచాలు! ఇవాళ ఉదయం జనక్‌పురిలో ఒక కాలేజీ అమ్మాయి తనని ప్రేమించనన్నదని ఆమె మొఖం మీద యాసిడ్ పోశాట్ట ఓ రోగ్. యూపీ నుంచి పొట్టచేత పట్టుకొచ్చిన ఆడకూలీ మీద ఇంటర్‌స్టేట్ బస్టేషన్లో నలుగురు అఘాయిత్యం చేశార్ట. ఎటు చూసినా అత్యాచారాలు, లైంగిక వేధింపులే. పురాణ కాలంలోనే కాదు ఇప్పుడూ స్త్రీకి బొత్తిగా భద్రత లేకుండా పోయింది!"

"అందరి సంగతీ ఏమోగాని, మన ఆకృతి గురించి బెంగ పెట్టుకోనక్కర్లేదు. తన తెగువ, ధైర్యం ప్రత్యేకమైనవి"

"అలా అని నిశ్చింతగా ఎలా వుండగలం చెప్పు?"

అవునంటూ తలాడిస్తూ అంది "అదీ పాయింటే. ఈ మగాళ్ళెందుకింత పశువుల్లా ప్రవర్తిస్తూంటారో తెలీదు. జైలు శిక్షలకీ ఎవరూ భయపట్టంలేదు! రసాయన ప్రక్రియ ద్వారా విపరీత లైంగిక ప్రవృత్తిని నాశనం చెయ్యలేమా!"

"మనుషుల్లోనూ రాక్షసులుంటారు. ఇప్పుడే కాదు. రాముడి కాలంలో రావణాసురుడుంటే, కృష్ణుడికాలంలో కీచకుడున్నాడు. యుద్ధాలు జరిగినప్పుడు శత్రురాజుకి చిక్కకుండా అంత:పుర ఆడవాళ్ళు అగ్నిలోకి దూకేవారని హిస్టరీలో చదువుకోలేదూ?"

"అప్పుడూ ఇప్పుడు కూడా ఆడదానికి అగ్నే దిక్కు అన్నమాట!" గోడకి తగిలించి వున్న కేలండర్లోని సీత బొమ్మ వంక చూస్తూ విచారంగా అంది సుధ.

"అహ అలాగని కాదు గాని పశుబలం ముందు నిలబళ్ళేరు. అందుకే ఆడవాళ్ళని వీకర్ సెక్స్ అనేది. ఆడవాళ్ళు తమ హ్యాండ్ బ్యాగుల్లో కారం పొట్లాలో, కళ్ళల్లో స్ప్రే చేసి కన్నుగప్పేవో పెట్టుకోవాలి. చిన్న చాకు, విజిలూ వుంచుకోవాలి. కరాటే గాకపోయినా నాలుగు పంచ్‌లిచ్చే పట్లు నేర్చుకోవాలి. సాధ్యమైనంతవరకూ ఒంటరిగా ఉండకూడదు. ఒంటరిగా ప్రయాణించకూడదు. రాత్రుళ్ళు నిర్మానుష్య ప్రదేశాల్లోకెళ్ళకూడదు. ఇలాంటివే

ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి......."

"బానిసల్లా ఖైదీల్లా సెకండ్ సిటిజన్లా బ్రతకాలంటారు!"

సుధ మాటలు వాడిగా తగిలాయ్. తుళ్ళి పడకుండా వుండలేకపోయాను.

"సుబ్రహ్మణ్య భారతి కాబోలు ఒకసారి ఆడవాళ్ళని బానిసలబానిస అన్నారు. దానర్థం.........."

"మగవారి కాళ్ళ దగ్గర ఎప్పటికీ పడి వుంటారని....!"

"అర్థం లేకుండా మాట్లాడకు" కస్సుమన్నాను.

"ఊరికే అరుస్తారేం? నాకు నా అభిప్రాయం చెప్పే హక్కు కూడా లేదా? ఎప్పుడూ మీకు వంత పాడుతూనే వుండాలా?"

దిగ్భ్రాంతుడ్నై పిచ్చిగా చూశాను. ఈమె...ముప్పై ఏళ్ళ నుంచి నాతో కాపురం చేస్తున్న సుధేనా?

"ఎప్పుడూ ఆడవాళ్ళు అణగి వుండాలి. జాగ్రత్తగా వుండాలి. తలొంచుకు పోవాలి. ఆకలి చూపుల్నీ వెకిలి నవ్వుల్నీ వ్యంగ్య బాణాల్నీ దులిపేసుకోవాలి. ఒంటినిండా కప్పే దుస్తులే ధరించాలి. ఎవరికి వాళ్ళు తమని తాము రక్షించుకోవాలి. తండ్రో మొగుడో కొడుకో తోడు లేకుండా ఎక్కడికీ వెళ్ళకూడదు. మొగుడు ఎలాటివాడైనా సరే పతిదేవుడంటూ పూజించాలి. ఆడబిడ్డ నేల మీద పడింది మొదలు ఇలా రకరకాలుగా చెప్పి ఎందుకు ఆడవాళ్ళని నిర్వీర్యం చేస్తున్నారు? ఎందుకు వాళ్ళ మెదళ్ళలో భయాల్ని, భ్రమల్ని ఇంజెక్ట్ చేస్తున్నారు? అనుక్షణం ఎందుకింత భయపడుతూ బతకమనేది? ఏం కోల్పోతామని? పవిత్రతా పాతివ్రత్యమా గౌరవమా చట్టుబండలా? అవి ఆడవాళ్ళకి మాత్రమే వుండే కవచకుండలాలా?"

దిమ్మెరబోయాను. సుధ ఎన్నడూ ఇంత ఆవేశపడలేదు. ఆమె మాటలకు కళ్ళల్లో చిమ్ముతోన్న క్రోధానికి నా మెదడు బ్లాంక్ అవుతోంటే నిస్తేజంగా చూస్తుండిపోయాను.

"నేను చెప్పేది జాగ్రత్తగా విని మీరూ, మీ మగాళ్ళూ మెదడుకెక్కించుకోండి. ఆడవాళ్ళ మీద రకరకాల ఆంక్షలు కట్టుబాట్ల సంకెళ్ళు విధించకండి. ఇలా వుండండి, అలా మసలండి, నవ్వకండి, కవ్వించే దుస్తులు ధరించకండి-అంటూ ఫర్మానాలు జారీ చెయ్యకండి. ఆడవారిని తోటి మనిషిగా సహచరిగా చూడమని మగాళ్ళకి చెప్పండి. ఆడపిల్లల్ని లైంగిక వస్తువులుగా చూడొద్దని మీ అబ్బాయిలకి, అన్నలకి, తమ్ముళ్ళకి, సహోద్యోగులకి అందరికీ చెప్పండి. ఆడశరీరం వంక ఆబగా చూడొద్దని చిన్నప్పట్నుంచీ చెవి మెలేసి చెప్పండి. వినకపోతే చెంపదెబ్బ వెయ్యండి. మగాళ్ళ మెదళ్ళని యాసిడ్‌తో కడగండి. యత్రనార్యస్తు.....అని ఊరికే వల్లిస్తే కాదు. స్త్రీ సృష్టి కర్త అనీ, ఆమెని పూజిస్తేనే ప్రకృతి వికృతిగా మారి వినాశనానికి దారి తీయకుండా వుంటుందనీ నూరిపోయండి.

అప్పుడు మగ దృష్టిలో ఆలోచనల్లో ప్రవర్తనలో ఎందుకు మార్పురాదో చూద్దాం!"

ఎన్నేళ్ళ నుంచో తొక్కి పట్టిన ఆక్రోశం ఆవేదన ఒక్కసారిగా లావాలా పొంగి వచ్చాయి. సాధారణ గృహిణి గుండెల్లో సైతం ఇంతటి అగ్ని పర్వతం దాగి వుందా? ఖచ్చితంగా ఇది నిన్నా మొన్నటిది కాదు. ఎన్నేళ్ళ నుంచి, కాదు ఎన్ని యుగాల నుంచి మేట వేసిందో!

నిప్పుల మాటల్ని విసిరి తన పని అయిపోయినట్టు దుప్పటి కప్పుకుని అటు తిరిగి పడుకుంది సుధ.

ఆమె మాటలు జీర్ణం కావడానికి చాలా సమయం పట్టింది.

ఆమె చెప్పిన కోణం నుంచి రాత్రంతా ఆలోచిస్తూ అలజడికి లోనయ్యాను.

తెల్లవారింది.

కాఫీ త్రాగుతూ ఐపాడ్‌లో తాజా వార్తలు తిరగేస్తున్నవాడినల్లా చెర్నాకోలాతో ఎవరో చెళ్ళున కొట్టినట్టు అదిరి పడ్డాను. సన్నగా కంపిస్తూ మరోసారి చదివాను.

క్రితం రాత్రి ఒక వైద్య విద్యార్థిని తన స్నేహితుడితో కలిసి సినిమా చూసి వస్తూ ప్రైవేటు బస్సు ఎక్కిందిట. అందులోని దుండగులు ఆమె స్నేహితుడ్ని కొట్టి, ఆమె మీద అత్యాచారం చేశార్ట. ఇనుపరాడ్‌తో కడుపులో గుచ్చి హింసించి అపస్మారకస్థితిలో వున్న ఆమెనీ ఆమె స్నేహితుడ్నీ బస్సులోంచి త్రోసేశార్ట. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోందిట!

ఎంత ఘోరం! ఎంతెంత దారుణం!

ఏదో గుర్తు రాగా ఆకృతి రూంలోకి పరుగు తీశాను. ల్యాప్‌టాప్ ముందు కూర్చుని సీరియస్‌గా ఏదో టైప్ చేస్తోంది.

నిట్టూర్చి వెనుదిరిగాను.

"ఏమైందండీ" సుధ ప్రశ్నించింది.

"మరో సామూహిక అత్యాచారం, మన ఢిల్లీలో!"

కూలబడింది. "ఆ పిశాచాల్ని పబ్లిగ్గా ఉరితీస్తే తప్ప ఆ జాడ్యం వదల్దు!"

ఆఫీసుకెళ్ళబోతూ ఆకృతికేవో జాగ్రత్తలు చెప్పాలని పిలిచాను. ఆమె కళ్ళు తడిసి ఉన్నాయి. కాని చూపులు నాలోని మగాడ్ని వాడి చూపుల కత్తుల్తో నిలువునా చీలుస్తున్నాయి.

నా జాతి తప్పుకి నేను తడబడి తప్పుచేసిన వాళ్ళా తప్పించుకొచ్చేశాను.

"అలా వున్నారేం సార్?" సెక్రటరీ అడిగాడు.

"ఎలా వున్నాను?"

"రక్తమంతా ఇంకిపోయినట్టు.......!"

పొడిగా నవ్వబోయి మానేశాను "రాత్రి బస్సులో జరిగిన ఘోరం గురించి

విన్నావనుకుంటాను.....”

“రోజూ ఏదో ప్రక్కన అలాంటివి జరుగుతూనే వుంటాయి సార్. మన ఢిల్లీలో మరీ ఎక్కువ. దేశానికే కాదు అత్యాచారాలకీ రాజధాని ఢిల్లీయేనని వ్యాఖ్యానిస్తున్నారంటే నమ్మండి”

“ఇలాంటి ఘటనలు జరిగిన ప్రాంతంలోని పోలీసుల్నీ, పోలీసు ఉన్నతాధికారుల్నీ అందుకు బాధ్యుల్ని చేసి కఠినంగా శిక్షించాలి. లేకపోతే మున్ముందు ఏం జరుగుతుందో ఊహించడానికే భయమేస్తోంది”

“పాపం పోలీసులు మాత్రం ఏం చేస్తారు సార్. ఢిల్లీలో లక్షమంది జనానికి 500 మంది పోలీసులున్నార్ట. పైగా మన సిటీ నిండా విఐపీలూ, వీవీఐపీలేనాయె. వాళ్ళకి భద్రత కల్పించడానికే సరిపోతోంది పోలీస్ ఫోర్సంతా!”

“మరేది దారి?”

“పాపం అని లిప్ సింపతీ చూపించడవే. ఎవరికి వారే యమునా తీరే అన్న నానుడి ఇక్కడే పుట్టింది సార్” నవ్వాడు.

పెదవి కొరుక్కున్నాను.

రాత్రి ఆ అమ్మాయికి జరిగినట్లు రేపు ఆకృతికి జరగొచ్చు. సుధకి జరగొచ్చు. నా అసిస్టెంటుకి జరగొచ్చు. ప్రక్కింటమ్మాయికి జరగొచ్చు. ఏ వయస్సు ‘ఆడ’కైనా జరగొచ్చు!

మరి ఈ గొలుసుకట్టును ఆపాలంటే? కల్కి అవతరించాలా? కలియుగం అంతమవ్వాలా?

మథన. గుండెల్లో, మెదడులో, నా శరీరంలోని అణువణువులో....!

పని మీద దృష్టి నిలవట్లేదు. టైం ఎలా గడిచిందో తెలీదు.

సెల్ మ్రోగింది. సుధ.

“ఇంటి తాళం ప్రక్కింట్లో ఇచ్చాను”

“నువ్వెక్కడికెళ్తున్నావ్?”

“ఇండియా గేట్‌కి”

“ఇప్పుడెందుకే? ఈలోగా ఆకృతి వస్తే......”

“రాదు. అన్నిదార్లూ అక్కడికే దారి తీస్తాయి.....”

“ఏం?”

“గళం విప్పడానికి”

“గళమా దళమా?”

“రెండూ కదనుతొక్కబోతున్నాయి.......”

“సుధా సుధా.....!”

"సారీ. డస్సిపోయాను....!"

లైన్ కట్ చేసింది. సుధకేమయ్యింది? ఇండియా గేట్ దగ్గరకే ఎందుకెళ్తోంది? ఆకృతీ వెళ్తోందిట...వారికేమైనా అయితే?

గుండెలు గుబగుబలాడాయి. మరి నిలవలేకపోయాను. ఆఫీసులోంచి బయటపడి కారు బయటికి తీశాను.

ఇండియాగేటు దగ్గరకి నలువైపుల్నుంచీ యువతులు బిలబిలమంటూ వస్తున్నారు. చీమల బారుల్లా.....చూస్తూండగానే వేలు అయిపోయారు. ఆడజనం ఇంకా ఇంకా వస్తూనే ఉన్నారు.

పోలీసులు అప్రమత్తమయ్యారు. బారికేడ్లు సిద్ధపర్చారు.

చూస్తూండగానే యాభైవేలు దాటి పోయారు. ఇంకో అంతమంది ఆడా మగా జనం ప్రోగై నిబిడాశ్చర్యంతో అపనమ్మకంగా చూస్తున్నారు.

విద్యార్థినులూ యువతలూ ప్లకార్డులు చేత బట్టి నినదిస్తున్నారు.

'సేవ్ విమెన్', 'ఉమన్ వాంట్ టు బి ఫ్రీ నాట్ ఫియర్ ఫుల్', 'ఏక్ దో తీన్ చార్ బంద్ కరో అత్యాచార్', 'క్యాపిటల్ పనిష్మెంట్ ఫర్ రేపిస్ట్స్', 'జీరో టోలరెన్స్', 'రేప్ సిటీ', 'జస్ట్ బికాజ్ ఐ షో మై లెగ్స్ డజ్ నాట్ మీన్ ఐ విల్ స్ప్రెడ్ దెమ్'

రక్తాన్ని మరిగించి ఆవేశపరుస్తోన్న రాతలు! ఉద్వేగ పరుస్తూ ఊపేస్తోన్న నినాదాలు!

వారిలో మా అమ్మాయి వుంది. నా భార్య వుంది. ఎందరెందరో కూతుళ్ళూ కోడళ్ళూ భార్యలూ అక్కలూ చెల్లెళ్ళూ అత్తలూ అమ్మమ్మలూ నానమ్మలూ వున్నారు.

ఒక పత్రికా ప్రకటన లేదు. ఒక పార్టీ దన్ను లేదు. ఒక సంఘం పిలుపు లేదు.

అయినా వేలాదిగా ఆడజనం ఆగ్రహిస్తూ స్వచ్ఛందంగా తరలి వచ్చారు. చాటింగుకీ టైంపాస్‌కీ ఉపయోగించే సోషల్ నెట్ వర్కింగ్ ద్వారా ఒకరు వంద మందికి చెప్పి ఒక్కుమ్మడిగా పిడికిళ్ళు బిగించి మరీ వచ్చారు.

వారి ఆగ్రహాన్ని చూస్తోంటే నాకెక్కడిలేని ధైర్యమూ వస్తోంది. నాలో సుళ్ళు తిరుగుతోన్న భయాలు, బుసలుకొడుతున్న అభద్రత పటాపంచలవుతోంది.

హఠాత్తుగా మహిళలు రాష్ట్రపతి భవనం వైపు చొచ్చుకుపోయారు. పోలీసుశక్తి వారి నాపలేక పోయింది. జల ఫిరంగులు పేల్చారు. భాష్పవాయుగోళాలు ప్రయోగించారు. లాఠీలతో విరుచుకుపడ్డారు.

అయినా ఎవరూ వెనుకంజ వేయట్లేదు.

సిగ్గులేని సమాజాన్ని, చేతకాని ప్రభుత్వాన్ని నిగ్గదీస్తూ శివమెత్తింది యువత. మగాడిలోని మృగాన్ని విశృంఖలత్వాన్ని నిర్జించేదాకా విశ్రమించమంటూ సాగరంలా

పోటెత్తింది.

కామాసురులపై కత్తి దూస్తోన్న ఆదిశక్తులను, అపరకాళికలను చూసి నేను సైతం ఉద్వేగంతో ఊగిపోయాను.

ఈ చైతన్యం ఈ స్ఫూర్తి ఈ హెచ్చరిక మొత్తం దేశంలో ప్రతిధ్వనిస్తుందన్న భరోసాతో ఉత్సాహంగా వెర్రి గొంతు కలిపాను!

ఈ స్త్రీ చైతన్య చారిత్రక ఘట్టం పద ఘట్టనల క్రింద మనిషాసురుల గుండెలు నలిగి పచ్చడవుతాయని ఆశిస్తూ, ఆకాంక్షిస్తూ నేనుసైతం పిడికిలి బిగించాను!

ఆ నిరసన స్వరాలు ప్రచండ ఘోషగా మారాయి. ప్రకంపనాలు సృష్టించాయి.

నిర్భయ చట్టం పురుడు పోసుకుంది!

***

**( ఉపాధ్యాయ, ఫిబ్రవరి – 2018 )**